
సాక్షి తిరుపతి

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



గ్రామీణ ఆట అదుర్స్

ఆడుదాం ఆంధ్రాలో భాగంగా చంద్రగిరిలో సాగుతున్న క్రీడా పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. - 8లో



భవనం కూలి ఇద్దరు మృతి

తిరుపతిలో పాత భవనం పడగొడుతుండగా, హఠాత్తుగా ఒకే సారి కూలిపోవడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. - 8లో



200 మొబైల్ ఫోన్ల రికవరీ

చోరీ అయిన 200 మొబైల్ ఫోన్లను చిత్తూరు పోలీసులు రికవరీ చేసి, వాటిని యజమానులకు అందజేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీగా సతీష్



తిరుపతి అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీగా జి.సతీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన ఇప్పటికే జిల్లా సూక్ష్మ సేద్య అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డికి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఉండేవి. అయితే ఆయన్ను ఉద్యానశాఖకు పరిమితం చేశారు. అదనపు బాధ్యతలను జి.సతీష్‌కు అప్పగించారు. ఆ మేరకు ఆయన కలెక్టరేట్‌లో గురువారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ కోసం 50 శాతం రాయితీలతో ఇస్తున్న యూనిట్లను పెద్ద ఎత్తున నెలకొల్పేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: జిల్లాకు సంబంధించిన ఈవీఎంల గోదాము వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, నిఘా ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం రేణిగుంటలోని ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. ఈవీఎంలకు ఇక్కడ నిరంతర నిఘా ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి కోదండరామిరెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మనోహరాచారి, కాంగ్రెస్ ప్రతినిధి రవి పాల్గొన్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి కృషి



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వీసీ వి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్వీయూ పరిపాలనా భవనంలో ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎస్వీ యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వర్సిటీతో ఎన్నో ఏళ్లుగా తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రొఫెసర్ స్థాయి నుంచి డీన్‌గా, ప్రిన్సిపల్‌గా, రెక్టార్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందితో మంచి సంబంధాలున్నాయని, అందరిని కలుపుకుని వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు అందుతున్నాయని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై మరింత దృష్టి సారించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, పాలక మండలి సభ్యులు, వర్సిటీ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన్ని ఘనంగా సన్మానించారు.

నేడు జగనన్న విద్యాదీవెన

తిరుపతి అర్బన్: జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 29న భీమవరం నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెంకట రమణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొంటారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించనున్నట్లు అందులో పేర్కొన్నారు. జిల్లాలోని 35,248 మంది విద్యార్థులకు జనవరి నుంచి మార్చి వరకు గల ట్యూషన్ ఫీజు సుమారు రూ.25.79 కోట్లను ముఖ్యమంత్రి నేరుగా విద్యార్థి–తల్లి ఉమ్మడి ఖాతాలకు జమ చేయనున్నారని తెలిపారు.

ముక్కంటి సేవలో అలెగ్జాండర్



ఆలయం వద్ద ఉస్తినోవ్ అలెగ్జాండర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం బ్రిక్స్ ఇన్ ఇండియా కల్చర్ అంబాసిడర్ ఉస్తినోవ్ అలెగ్జాండర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నవశకం

నాడు సర్కారు వైద్యం అంటేనే జనం వామ్మో.. అంటూ భయపడి పారిపోయే వారు. నేడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్ద వావ్.. అంటూ క్యూ కడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరైన వైద్యం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా అత్యాధునిక వసతులు సమకూర్చారు. పరిశుభ్రత నుంచి వైద్యుల నియామకం వరకూ సకాలంలో పూర్తి చేశారు. అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్ని రకాల మందులు, ల్యాబ్‌లు ఆయా ఆస్పత్రులకు అందించారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యం గాడిలో పడింది. పేదలకు ఆరోగ్యం కుదుటపడుతోంది.



తిరుమలరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం

అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది వివరాలు	
మెడికల్ ఆఫీసర్	1
స్పెషలిస్టులు	4
గైనకాలజిస్టులు	1 (మంగళవారం)
జనరల్ ఫిజీషియన్	1 (శుక్రవారం)
జనరల్ సర్జన్	1 (శుక్రవారం)
ఆర్థో	1 (గురువారం)
స్టాఫ్ నర్సులు	2
ఫార్మసిస్టు - 1 టెక్నీషియన్	1
డేటా ఎంట్రీఆపరేటర్	1
అసిస్టెంట్ -1 ఏఎన్‌ఎంలు	5
ఆశా వర్కర్లు	11

తిరుపతి అర్బన్ హెల్త్ సెంటర్ల వివరాలు	
మొత్తం హెల్త్ సెంటర్లు	13
అందుబాటులో ఉన్న మందులు	173 రకాలు
రోగులకు చేసే పరీక్షలు	63 రకాలు

ఆధునిక ల్యాబ్ మిషనరీలు

సెమీ అనలైజర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్, హెమటాలజీ అనలైజర్, యూరిన్ రీడర్, సెంట్రిఫ్యూజ్, బ్లడ్ మిక్సర్, మైక్రోస్కోప్

ఆధునిక వసతులు

వైద్య పరికరాల ఖర్చు – రూ.20 లక్షలు

డాక్టర్స్ రూమ్స్ -2, ల్యాబ్-1, వార్డు-1, ఫార్మసీ-1, వేచియుండు గది-1, డ్రెస్సింగ్ రూమ్-1, లేబర్ రూమ్-1, రిసెప్షన్ -1, టాయ్‌లెట్స్ -3

రోజువారీ ఓపీ సేవలు	70-105
రోజువారీ వైద్య పరీక్షలు	55-65
మెడికల్ రిపోర్ట్ :	రోగి మొబైల్ నంబర్‌కు వెళ్లేలా చర్యలు

ఆరోగ్యం.. ఆహ్లాదం

- మెరుగుపడిన పట్టణ ఆరోగ్యం
- శిథిల ఆస్పత్రులకు సర్కారు వైద్యం
- కార్పొరేట్ తరహాలో ఆధునికీకరణ
- వైద్యం కోసం క్యూ కడుతున్న జనం

తిరుపతి తుడా : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా పేదవాడికి మెరుగైన వైద్యం ఉచితం అందించాలన్నదే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించారు. వైద్య పరికరాలు, అవసరమైన సిబ్బందిని సమకూర్చి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. పేదవాడికి ఆపద్బాంధవి అయిన 108 వాహన సేవలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆ సేవలను సైతం పునరుద్ధరించారు. పట్టణ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా అత్యాధునిక వైద్యం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. నగరంలో 2021 వరకు కేవలం 9 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండేవి. పట్టణ వైద్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తిరుపతికి ఏక కాలంలో ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. మున్సిపల్ కార్పొరేషన్ యుద్ధ ప్రాతిపదికన నాలుగు నిర్మాణాలను పూర్తి చేసి ఆరోగ్య శాఖకు అప్పగించింది.

అత్యాధునిక వైద్య సదుపాయాలు

వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్స్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ క్రమంలో ఒక్కొక్క హెల్త్ సెంటర్‌కు రూ.20కోట్లతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. ఈ కేంద్రాల్లో ఆధునిక వైద్యంతో పాటు గతానికి భిన్నంగా అత్యాధునిక వసతులను, పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్పొరేట్ తరహాలో ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. 63 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పాటు 173 రకాల మందులను అందుబాటులో ఉంచారు. ఇటీవల నిర్మించిన నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లకోసం రూ.4.40కోట్లను ఖర్చు చేయగా, వైద్య పరికరాల కోసం రూ.80లక్షల వరకు ఖర్చు చేశారు.

అందుబాటులో మందులు

గతంలో జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులకు మాత్రమే చికిత్స చేసి మందులు ఇచ్చేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్లలో షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేసి నెలవారీ మందులను ఉచితంగా రోగులకు అందిస్తున్నారు.



ముత్యాలరెడ్డిపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం



తిరుపతిలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి



ఎమ్మార్‌పల్లి సెంటర్‌లో ఓపీ నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది



ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉన్న మందులు

వైద్య సేవలు బాగున్నాయి



నాకు వీపుపైన గడ్డ రావడంతో వైద్య పరీక్షల కోసం ఇక్కడికి వచ్చాను. నా భార్య నడుపమ్మకు సుగర్ వ్యాధి ఉంది. ప్రతి నెలా ఉచితంగా మందులు ఇస్తున్నారు. నా కూతురు రాధమ్మ అనారోగ్యానికి గురైనప్పుడు ఎక్స్‌రే, ఈసీజీ, రక్త పరీక్షలు అన్ని ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌లోనే చేశారు. గతంలో జ్వరానికి తప్ప ఇంక ఏ మందులు ఆస్పత్రిలో ఉండేవి కావు. ఇప్పుడు ప్రతి వ్యాధికి ఇక్కడ వైద్యం, మందులు ఉచితంగా చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యులు సిబ్బంది పనితీరు చాలా బాగుంది.

–గురవయ్య, టీఎస్ పాళెం, తిరుపతి.

మంచి మందులు ఇస్తున్నారు



కుడి భుజం నొప్పిగా ఉంటే ఆస్పత్రికి వచ్చాను. రక్తం తీసుకుని పరీక్షకు పంపించారు. తక్షణం నొప్పి తగ్గేందుకు కొన్ని మందులు ఇచ్చారు. నా భార్య ద్రాక్షాయిణి గైనిక్ సమస్యకు ఇక్కడికే వస్తుంటాం. మూడు నెలలకోసారి రక్త పరీక్షలు చేయించుకుంటున్నాం. నాణ్యమైన మందులు ఇస్తున్నారు. ఇక్కడ వైద్యులు, సిబ్బంది పనితీరు చాలా బాగుంది. పెద్దాస్పత్రుల తరహాలో ఆరోగ్య కేంద్రం నడుపుతున్నారు. గతంలో మా ప్రాంతం వాసులు స్కావెంజర్స్ కాలనీ హెల్త్ సెంటర్‌కు వచ్చేవారు. ప్రస్తుతం మా ప్రాంతంలోనే కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. చాలా సౌకర్యవంతంగా ఉంది. – జైశంకర్, కరకంబాడి రోడ్డు, తిరుపతి

అన్ని పరీక్షలు ఇక్కడే



ప్రతి నెలా నేను సుగర్ మాత్రలు ఇక్కడే తీసుకుంటున్నాను. రెండు నెలలకోసారి షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ లాంటి పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. ఈ హెల్త్ సెంటర్‌లో మందుల కొరత అనే మాటే వినిపించలేదు. రోగులు ఎంతమంది వచ్చినా వారిని చూసేందుకు అవసరమైన సిబ్బంది ఉంటున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే వంటి పరికరాలు అందుబాటులో ఉంచారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్పొరేట్ తరహాలో ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు చాలా బాగున్నాయి. దీంతోపాటు అర్బన్ హెల్త్ సెంటర్‌లో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు.

–సనోబర్ మునీషా, పీవీఎస్ నగర్, తిరుపతి

చాలా సౌకర్యంగా ఉంది



జ్వరం, కాళ్ల నొప్పులతో ఇక్కడి వచ్చాను. రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరం అని డాక్టర్లు చెప్పారు. రెండు రకాల మందులు ఇచ్చి, ఇంజెక్షన్ వేశారు. జ్వరం ఉండడంతో కాళ్ల నొప్పులు వచ్చాయని చెప్పారు. గతంలో స్విమ్స్ ఎదురుగా ఉన్న ఆసుపత్రికి వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఇక్కడికి తప్ప మేము ఏ ఆస్పత్రికీ వెళ్లం. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా సరే ఇక్కడే మందులు ఇస్తున్నారు. అవసరమైతే రక్త పరీక్షలు చేస్తున్నారు. ఇప్పుడు మా ప్రాంతంలోనే కొత్త ఆసుపత్రిని పెట్టారు. చాలా సౌకర్యంగా ఉంది. ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు బాగా చూస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

–శాంతమ్మ, ఐఎస్ మహల్, తిరుపతి

ఆస్పత్రి పరిశుభ్రంగా ఉంది



తిరుమల రెడ్డి నగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు నేను తొలిసారి వచ్చాను. గతంలో స్కావెంజర్స్ కాలనీ హెల్త్ సెంటర్, రుయాస్పత్రిలో చూపించుకునే వాళ్లం. ఈ ఆస్పత్రిని చూడగానే పరిశుభ్రంగా కనిపించింది. ఆస్పత్రి లోపల విభాగాల వారీగా ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. బయట ప్రైవేట్ మందుల షాపు తరహాలో ఇక్కడ గదులు నిండుగా మందులు కనిపించాయి. చెవి నొప్పి రావడంతో డాక్టర్ దగ్గరకు వెళ్లాను. మందులు ఉచితంగా అందించారు. ఈ ఆస్పత్రి ఇలా మారుతుందని నేనెప్పుడూ అనుకోలేదు.

–నాగజ్యోతి, కొర్లగుంట, తిరుపతి

18 ఏళ్ల కల సాకారం!



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి

- ముఖ్యమంత్రి, టీటీడీ చైర్మన్‌కు రుణపడి ఉంటాం
- టీటీడీ హౌసింగ్ సొసైటీ నాయకులు, ఉద్యోగుల ఆనందోత్సాహాలు

తిరుపతి(అలిపిరి): 'చెప్పుడు మాటలు వినను..చెప్పిందే చేస్తాను' అంటూ టీటీడీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అడుగులేశారు. ఇళ్లపట్టాల విషయమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఫలితంగా టీటీడీ ఉద్యోగుల 18 ఏళ్ల కల సాకారమైంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు వీరబ్రహ్మం, సదాభార్గవి సహకారంతో ఉద్యోగులందరికీ పట్టాలు అందజేశారు. మహతిలో గురువారం వేడుకగా ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ వేలాది మంది ఉద్యోగులకు తన చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ఒక్క ఉద్యోగి కూడా నిరాశపడకూడదని, ఏడాది క్రితం ఉద్యోగంలో చేరిన వారికి పట్టా అందించాలని స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. మొదటి విడతగా వడమాలపేట వద్ద 3,518 మందికి ప్రస్తుతం పట్టాలు అందిస్తున్నామని, ఇక్కడ అవసరమైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎవరూ స్థలాలు అమ్ముకోరాదని, ఏడాది తిరక్కుండానే మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి పలికే అవకాశం ఉందన్నారు. హౌసింగ్ సొసైటీ నాయకులు, పట్టాలు పొందిన ఉద్యోగులు తమ అభిప్రాయాలను సంతోషంగా 'సాక్షి'తో పంచుకున్నారు.

తిరుమలలో పని చేయడం అదృష్టం



తిరుమలలో పనిచేయడం అందరి అదృష్టంగా భావించాలి. టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇచ్చారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కోసం రూ.210 కోట్లను ఉద్యోగుల తరపున చెల్లించాం. పాగాలి వద్ద 350 ఎకరాలు త్వరలోనే స్వాధీనం చేసుకుని జనవరి చివరి నాటికి టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ ఇంటి స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తాం. సీఎం వైఎస్ జగన్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సహృదయంతో చేసిన కృషి వల్లే టీటీడీ ఉద్యోగులకు లబ్ధి కలిగింది.

– ఏవీ ధర్మారెడ్డి, ఈవో, టీటీడీ దేవస్థానం

ఇన్నాళ్లకు కల నెరవేరింది



నా సంపాదన పూర్తిగా కుటుంబ ఖర్చులకు, పిల్లల చదువులకు వినియోగిస్తాం. ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇస్తారని ఎన్నో ఏళ్ల నుంచి వింటూనే ఉన్నాం. చివరికి అయితే ఒకానొక సమయంలో నిరుత్సాహ పడ్డాం. అయితే టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి కృషి ఫలితంగా నేడు నాకే కాదు. టీటీడీ ఉద్యోగులందరి కల నెరవేరుతోంది అంటే చెప్పలేనంత ఆనందంగా ఉంది. మాకు పట్టాలు అందించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– విజయలక్ష్మి, టీటీడీ ఉద్యోగిని, అశ్విని హాస్పిటల్

కలయా.. నిజమా



ఉద్యోగులందరికీ పట్టాలు అందిస్తుండటం ఇప్పటికీ కలయా.. నిజమా అన్నట్లుంది. మా భర్త వెంకటరెడ్డి టీటీడీలోని విజిలెన్స్ విభాగంలో సుమారు 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్నారు. సొంతంగా ఇంటి స్థలం కొనాలని ఎదురుచూస్తూనే ఉన్నాం. ఇన్నాళ్ల ఇంటి స్థలం ఇస్తామని చెబుతూ వచ్చినా నేడు టీటీడీ చైర్మన్ కృషితో పట్టాలు అందడం సంతోషంగా ఉంది. స్థలముంటే చాలు ఏదోరకంగా ఇల్లు కట్టుకోవచ్చనుకుంటున్నాం. తిరుమల స్వామివారి దీవెనలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రజలకు నిరంతరం సేవలందించాలి.

– బి.సుధామణి, టీటీడీ ఉద్యోగి వెంకటరెడ్డి సతీమణి

జీవితాంతం రుణపడి ఉంటాం



టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు అందించాలని కోరుతూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదలైన ఇళ్ల పట్టాల పంపిణీ తంతు నేడు ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మా చేతికి చేరింది. మేము మహిళల సమస్యలతోపాటు పట్టాల కోసం చేసిన పోరాటం ఫలించింది. ఇందుకు ముఖ్యమంత్రితోపాటు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– సానంరెడ్డి కల్పన, ఆది లక్ష్మి, సుగుణ, టి.హేమసుధ, టీటీడీ యూనియన్ మహిళా నాయకులు

వంద శాతం అర్హులకు సంక్షేమం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, నేతలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వందశాతం అర్హులందరికీ అందించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సామాజిక పింఛన్లు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాల నిర్వహణపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాడేపల్లి నుంచి సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటరమణారెడ్డితోపాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు. ఆయన ఇచ్చిన ఆదేశాలను అధికారులు రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఆ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై వర్క్‌షాప్

చంద్రగిరి: కల్యాణీ డ్యాం సమీపంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల(పీటీసీ)లో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్రిప్టో కరెన్సీ సంబంధిత సైబర్ నేరాల విచారణపై గురువారం ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సమన్వయంతో క్రిప్టోకరెన్సీ నేరాలకు సంబంధించిన కేసులను విజయవంతంగా పరిశోధించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ తెలంగాణ రాష్ట్రాల నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐ స్థాయికి చెందిన 40 మంది అధికారులు ఈ శిక్షణకు హాజరయ్యారు.

సిలికా నిల్వలపై తనిఖీ


సిలికా గుట్టలపై సర్వే చేస్తున్న ఉద్యోగి

చిల్లకూరు: ఐదు నెలల క్రితం వరకు సిలికా తవ్వకాలు చేపట్టిన ఓ సంస్థకు చెందిన సిలికా నిల్వలపై విజిలెన్స్ అధికారులు గురువారం వివరాలు సేకరించారు. అప్పట్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టారని కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ మల్లేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సర్వే బృందాలతో కలసి కలవకొండ, అంకులపాటూరు ప్రాంతాల్లోని సిలికా నిల్వలను తనిఖీ చేశారు. ఈ బృందం వెంట వీఆర్‌ఓ శ్రీనివాసులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలస

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజల పట్ల చూపుతున్న ఆదరణ, పార్టీ సిద్ధాంతాలు నచ్చి వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం ముస్లిం పేటకు చెందిన టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం తుమ్మలగుంటలోని నివాసం వద్ద వారు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆయన సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రంజిత్, ఇతర నాయకులు బారేసా, నూర్‌బాషా, లాల, జిలానీ తదితరులు ఉన్నారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి ప్రజలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా ముస్లింపేటలో ఏళ్లుగా శ్మశాన వాటిక సమస్య తీర్చారని, సీసీ రోడ్లు, ప్రహరీ ఏర్పాటు చేసి ఆదుకున్న చెవిరెడ్డి కుటుంబానికి అండగా ఉండాలనే వైఎస్సార్ సీపీలో చేరినట్లు రంజిత్ తెలిపారు. అలాగే ముస్లింపేటలో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. అడిగిన వెంటనే సహకరిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొక్కల తిమ్మా రెడ్డి, సర్పంచ్ మొక్కల భారతి, మైనారిటీ సెల్ నాయకులు సుర్జిత్, సాహిల్ పాల్గొన్నారు.

క్యాట్ టాపర్లకు అభినందనలు


క్యాట్ ఆలిండియా టాపర్లను అభినందిస్తున్న కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన క్యాట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి ఎమ్మార్ పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ స్కోరు సాధించారు. ఈ ఫలితాల్లో తిరుపతి ఐఐటీ విద్యార్థి సి.చక్రధర్ 98.93పర్సంటైల్‌తో ఏపీలో టాపర్‌గా నిలిచాడు. ఎస్వీ అగ్రికల్చర్ విద్యార్థి ఎం.గౌరీశంకర్‌రెడ్డి 93.46, కె.రిషివర్ధన్ 90.65, కె.సాయికిరణ్‌రెడ్డి 84.87, సి.భవ్యశ్రీ నిషిత 84.50, ఎ.హేమచంద 82.89, సుమ లహరి 80.25, బి.జెనిస్ (మహిళా వర్సిటీ) ఎన్ మ్యాట్ ఫలితాల్లో 220 స్కోరు సాధించారు. వీరిని గురువారం కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ ఐఐఎం విద్యాసంస్థల్లో ఎంబీఏ ప్రవేశానికి నిర్వహించే క్యాట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించడం తమకు గర్వకారణమని తెలిపారు. డిగ్రీ విద్యార్థులు సైతం క్యాట్ పరీక్షకు అర్హులని, క్యాట్ ద్వారా ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాళహస్తిలో వ్యక్తి ఆత్మహత్య

- రాజకీయం చేయొద్దని భార్య విజ్ఞప్తి
- వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టీకరణ


రాయి రవికిరణ్ (ఫైల్)


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అనసూయమ్మ

శ్రీకాళహస్తి: పట్టణంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు పానగల్ వద్ద భారతినగర్ కాలనీలో (హౌసింగ్ బోర్డు) రాయి రవికిరణ్(35), భార్య శ్రీవిద్య, కుమారుడు జయదేవన్‌తో కలిసి నివసిస్తుండేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి రవికిరణ్ ఇంటికి వచ్చి, భోజనం చేసి గదిలోకి వెళ్లి పడుకున్నారు. ఉదయం ఆయన కుమారుడు జయదేవన్ వెళ్లి గది తలుపులు తీయగా తండ్రి విగతజీవుడిగా ఫ్యానుకు వేలాడుతుండడం కనిపించింది. బోరున విలపిస్తూ బయటకు పరుగులు తీసి చుట్టుపక్కల వారిని పిలుచుకువచ్చాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫ్యాన్‌కు వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దింపి వివరాలు తీసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఆరా తీయగా వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ శవ రాజకీయం

రవికిరణ్ భార్య శ్రీవిద్య మాట్లాడుతూ తన భర్త వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. దీన్ని టీడీపీ నాయకులు బొజ్జల సుధీర్ రెడ్డి రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. దయచేసి దీనిని రాజకీయం చేయొద్దని ప్రాధేయపడ్డారు. ఎమ్మెల్యే కుటుంబంతో తాము సఖ్యతగా ఉన్నామని, తన కుటుంబానికి ఎమ్మెల్యే నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉన్నందువల్లే ఈ స్థాయికి ఎదిగామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

రాయి రవికిరణ్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రి నుంచి రవికిరణ్ మృతదేహాన్ని ర్యాలీగా తీసుకువచ్చారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో వారి అత్త అనసూయమ్మ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

యాదృచ్ఛికమా.. శాపమా?

రాయి రవికిరణ్ తమ్ముళ్లు ఇద్దరు కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అతని సోదరుడు రాజా కిరణ్ కుటుంబ కలహాలతో 2009లో, సూర్యకిరణ్ ప్రేమ వ్యవహారంలో 2018లో ఆత్మహత్య చేసుకున్నాడు. తాజాగా రాయి రవికిరణ్ అదే తరహాలో మృతి చెందడం వారికి కుటుంబానికి శాపమా.. యాదృచ్ఛికమా అన్న చర్చ పట్టణంలో మొదలైంది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

నాయుడుపేటటౌన్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ అధికారులు తెలిపారు. ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ కథనం మేరకు, పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఎస్‌ఈబీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌ఆర్ కాలనీకు చెందిన వెంకటేశ్వ ర్లు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 1.2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వెంకటేశ్వర్లుపై గతంలో కూడా గంజాయి కేసులు ఉన్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ సీఐతోపాటు నాయుడుపేట ఎస్‌ఐ రఘునాథ్ పాల్గొన్నారు.

తిరుపతి కళాకారుల గిన్నిస్ రికార్డు


నాగ విద్య, నాగ సింధూ

తిరుపతి కల్చరల్: కూచిపూడి నాట్య కళాకారుల నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు నమోదులో తిరుపతి కళాకారులైన చిన్నారులు నాగ విద్య, నాగ సింధూకు చోటు దక్కింది. గిన్నిస్ రికార్డులో చోటు సాధించడమే లక్ష్యంగా భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో అత్యంత భారీ స్థాయిలో 3,782 మంది కళాకారులచే కూచిపూడి నృత్య మహా ప్రదర్శన నిర్వహించారు. తిరుపతి భాష్యం స్కూల్‌లో చదువుతున్న 3వ తరగతి విద్యార్థిని నాగ విద్య, 8వ తరగతి చదువుతున్న నాగ విద్య ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో డాక్టర్ ఉషారాణి వద్ద కూచిపూడి శిక్షణ పొందారు. భారత్ ఆర్ట్ అకాడమీ పిలుపు మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం చేపట్టిన నృత్య మహా ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటి రికార్డులో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్ర మానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ మహా ప్రదర్శనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కల్పిస్తున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభతో రికార్డులో చోటు దక్కించుకున్న విద్యార్థులను భాష్యం అధినేత రామకృష్ణ, జెడ్‌ఈవో లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

ఇనాం భూములకు పట్టాలు


కలెక్టర్ వెంకటరమణారెడ్డికి పరశురామేశ్వర స్వామి చిత్ర పటం, ప్రసాదాలు అందజేస్తున్న నరసింహ యాదవ్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఇనాం భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాల మంజూరుకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి అనుమతి ఇచ్చారు. గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నరసింహయాదవ్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, సన్మానించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఇనాం భూముల సమస్యను ఆయనకు విన్నవించారు. గుడిమల్లం రెవెన్యూలో 173 సర్వే నంబర్‌లో సుమారు 1,500 ఎకరాల ఇనాం భూములున్నాయని చెప్పారు. వీటిలో 219 మంది రైతులు 350 ఎకరాల భూములను తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరామని, ఇప్పటికే ఈ సమస్యను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని, పట్టాల పంపిణీకి అనుమతి మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారని నరసింహయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలి


స్టెమ్ ల్యాబ్ పరిశీలనలో అధికారులు

రేణిగుంట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. పాఠశాల నాడు–నేడు కింద అభివృద్ధి చెంది ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రాంగణమంతా పచ్చదనాన్ని సంతరించుకుని ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రగతి సంస్థ ఏర్పాటు చేసిన స్టెమ్ ల్యాబ్‌లో సాంకేతిక పద్ధతిలో బోధన చేయాలని సూచించారు. ప్రయోగాత్మక బోధన సాగాలన్నారు. పాఠశాలలో ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్)లు విరివిగా ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, తిరుపతి డీవైఈవో ఆనందరెడ్డి, తిరుపతి అర్బన్ ఎంఈవో బాలాజీ, హైస్కూల్ హెచ్‌ఎం పుష్పలత పాల్గొన్నారు.

అట్టహాసంగా మొహంజొదారో శత జయంతి


చిత్రాలను పరిశీలిస్తున్న భవిన్ షా, అమరేందర్ నాథ్, మంచు మోహన్‌బాబు

చంద్రగిరి: మొహంజొదారో శత జయంతోత్సవాలు రెండవరోజు గురువారం అట్టహాసంగా ముగిశాయి. ముఖ్య అతిథులుగా ఎంబీయూ వీసీ, శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ మంచు మోహన్ బాబు, ముంబయి ఎడ్యుకేషన్ వరల్డ్ సీఈఓ భవిన్ షా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ అమరేందర్ నాథ్ విచ్చేశారు. ఫొటో గ్యాలరీ, మొహంజొదారో సంస్కృతికి సంబంధించిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. కలంకారీ డిజైనర్లు, బుట్టలు అల్లేవారు, మట్టి కళాకారుల స్టాల్, వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల రూపొందించిన స్మారక చిత్రాలను చూసి భవిన్‌షా అభినందించారు. ప్రిన్సిపాల్ రాజేష్ పాటిల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులికాట్ సరస్సు రోడ్ల దుస్థితిపై సమీక్ష


బాజ్‌పాయితో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని పులికాట్ సరస్సు వద్ద ఉన్న పేర్నాడు, వేనాడు ప్రాంతాల రోడ్ల దుస్థితిపై జాతీయ పర్యావరణ అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి బాజ్‌పాయి సమీక్ష నిర్వహించారు. ఆయన గురువారం పులికాట్ సరస్సును సందర్శించారు. ఆయన పులికాట్ సరస్సు గురించి పర్యావరణ, అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విదేశీ పక్షుల రాక, వాటి ఆహార సేకరణపై ఆరా తీశారు. అనంతరం ఆయన అట్టకానితిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, తహసీల్దార్ రవికుమార్ బాజ్‌పాయిని కలసి పేర్నాడు, వేనాడు ప్రాంతాల రోడ్ల దుస్థితిపై వివరించారు. దీనిపై స్పందించిన సంయుక్త కార్యదర్శి భారత ప్రభుత్వంతో సంప్రదించి, ఆయా గ్రామాల్లో మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

200 మొబైల్ ఫోన్ల రికవరీ

- రూ.45 లక్షల మొబైల్స్ యజమానులకు అందజేసిన పోలీసులు

చిత్తూరు అర్బన్: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి వాటిని అందజేసినట్లు క్రైమ్ సీఐ భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివిధ కారణాలతో చాలామంది ఫోన్లను పోగొట్టుకుని, ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి చాట్‌బూట్ సాయపడుతోందన్నారు. మొబైల్ ట్రాకింగ్ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయిస్తోందన్నారు. ఇప్పుడు రూ.45 లక్షలు విలువ చేసే 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేసిందన్నారు. వీటిని ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, జమ్ము, కాశ్మీర్ రాజస్థాన్, బిహార్, కేరళ రాష్ట్రాల్లో కూడా రికవరీ చేయిస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. మొబైల్ వివరాలు అందజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు క్రైమ్ విభాగం పోలీసులు కృషి చేస్తారన్నారు. ఇప్పటివరకు నాలుగు దశల్లో సుమారు రూ.2.50 కోట్ల విలువ చేసే 1200 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టుబడిన ఫోన్లను ఇతర రాష్ట్రాల్లో ఉంటే వారికి కొరియర్ ద్వారా బాధితుల ఇళ్లకే చేరుస్తామన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు 9440900004 వాట్సాప్‌కు మెసేజ్ చేస్తే చాలన్నారు. కేసు ఛేదనలో చాట్‌బూట్ ద్వారా ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పనితీరును అభినందించారు.

పాత భవనం కూలి ఇద్దరు మృతి


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


ప్రమాదంలో మృతి చెందిన కూలీ

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో పాత భవనం ఒక పక్క కూల్చుతుండగా మరోపక్క కూలిపోయి ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వెస్ట్ పోలీసుల కథనం మేరకు, నగరంలోని మంచాల వీధిలో నివాసం ఉంటున్న షబ్బీర్ అదే ప్రాంతంలో తన పాత ఇంటిని కూల్చేందుకు మోషన్ బాషాకు కాంట్రాక్ట్ ఇచ్చాడు. అతను ఆరుగురు కూలీలను తీసుకొచ్చి పాత భవనాన్ని కూల్చడం ప్రారంభించాడు. అదే సమయంలో మరో వైపు నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో అనంతపురం జిల్లా కదిరికి చెందిన నారాయణ(40), వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నరసింహులు(50) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఇదే ప్రమాదంలో ఒక మహిళతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

గ్రామీణ ఆట అదుర్స్

- ఉత్సాహం నింపుతున్న.. 'ఆడుదాం ఆంధ్ర'
- 3వ రోజు చెలరేగి ఆడిన క్రీడాకారులు
- క్రీడాకారులకు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ప్రోత్సాహం


తుమ్మలగుంటలో క్రీడాకారులకు క్రికెట్ కిట్టును అందిస్తున్న జేసీ శుభం బన్సాల్, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: పల్లెల్లో క్రీడోత్సవం ఉత్సాహంగా సాగుతోంది. గ్రామీణ క్రీడాకారుల ఆట అదుర్స్ అంటూ ఉత్సాహ పరుస్తున్నారు. మూడోరోజు గురువారం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తుమ్మలగుంటలో క్రీడాకారులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. బౌలింగ్, బ్యాటింగ్ చేస్తూ ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను నియోజకవర్గ పరిధిలో పర్యవేక్షించారు. యువతను ఉత్సాహపరుస్తూ క్రీడాకారులకు కిట్లు అందజేశారు.

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట క్రీడా మైదానంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ పర్యవేక్షించారు. వారిద్దరూ కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. ముందుగా జేసీ బౌలింగ్ చేయగా తుడా చైర్మన్ బ్యాటింగ్ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

పాకాలలో..

పాకాల మండలంలో ఊట్లవారిపల్లి, గానుగపెంట పంచాయతీలలో ఆయా క్రీడాపోటీల్లో యువ జట్లు దుమ్మురేపాయి. పండుగ వాతావరణంలో క్రీడాకారులు ఖో ఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో సత్తా చాటారు. క్రికెట్ ఆడిన తుడా చైర్మన్ యువతను ఉత్సాహ పరిచారు. క్రీడల్లో పాల్గొని శారీరక ధృఢత్వం పెంపొందించుకోవాలని మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఆర్సీపురంలో..

ఆర్సీపురంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రసవత్తరంగా సాగింది. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆ తరువాత వారితో కలిసి క్రికెట్ ఆడారు. మిగిలిన క్రీడలను పర్యవేక్షించి, క్రీడాకారులను ప్రోత్సహించారు. ఆయా పంచాయతీల్లో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతంగా నిర్వహించారు.